## బోడుప్పల్ వక్ఫ్ సమస్య ఇక నాది

- గెజిట్ డీనోటిఫై చేసే వరకు విశ్రమించను: కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- దీపావళి అంది వచ్చిందటూ.. పటాకులు కాల్చి కాలనీవాసుల సంబరాలు
- మంత్రి సేవల్ని కొనియాడిన బీజేపీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, జాక్ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి
- మేడ్చల్ నియోజవర్గ ఎమ్మెల్యే స్థానానికి వేసిన 88 నామినేషన్లను నేడు వెనక్కి తీసుకునే అవకాశం: జాక్ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి



బోడుప్పల్ వక్ఫ్‌బోర్డు బాధితులతో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి, ప్రక్కన మేయర్ బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ లక్ష్మీరవిగౌడ్, పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, వక్ఫ్‌బోర్డు జాక్ నేతలు, శ్రీధర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

బోడుప్పల్, నవంబర్ 13: బోడుప్పల్ వక్ఫ బోర్డు సమస్య మీది కాదు. ఇకపై నాది.. అంటూ రాష్ట్ర మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చామకూర మల్లారెడ్డి బాధితులతో అన్నారు. ఆర్ఎన్ఎస్ కాలనీలో బోడుప్పల్ వక్ఫ్‌బోర్డు జాక్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సభకు మేయర్లు బుచ్చిరెడ్డి, జెక్క వెంకట్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదల పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉదారత, రాష్ట్ర ఐటీ పురపాలక శాఖ మంత్రి చొరవతో వక్ఫ బోర్డు సమస్య కొలిక్కి వచ్చిందటూ మంత్రి పేర్కొన్నారు. పేదల పక్షాన జేఏసీ ఏర్పడి తెలంగాణ రాష్ట్ర సాధన తరహాలో పోరాట పటిమ, ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన తీరును మంత్రి కేటీఆర్ కొనియాడారన్నారు. ఏడువేల కుంటుంబాలు ఎదుర్కొన్న ఇబ్బందులను విన్న కేటీఆర్ సానుకూలంగా స్పందించారని, తక్షణమే సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డుపై ఇచ్చిన గెజిట్‌ను డీ నోటిఫై చేసేవరకు విశ్రమించనని, పట్టువదలని విక్రమార్కుడినని బాధితులకు మంత్రి హామీ ఇచ్చారు. ఇందుకు అయ్యే ప్రతి పైసా ఖర్చును కూడా తానే భరిస్తానని కాలనీవాసులకు హామీ ఇవ్వడంతో 'జై మల్లన్న.. జైజై మల్లన్న...' అన్న నినాదాలు సభలో మార్మోగాయి.

### నేటి నుంచే రిజిస్ట్రేషన్లు, ఇంటి అనుమతులు: మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్ వక్ఫ బోర్డు బాధితులకు సమస్యలు తొలగిపోయాయని, నేటి నుంచే రిజిస్ట్రేషన్లు, ఇంటి అనుమతుల మంజూరు పక్రియ ప్రారంభమైనదని మంత్రి మల్లారెడ్డి వెల్లడించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు మీరు చేసే పోరాటంలో మీతో పాటే నేనుంటానని శపథం చేస్తున్నానని మంత్రి ప్రకటనతో కాలనీవాసులు టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. సమస్య పరిష్కారానికి మిగిలిన లీగల్టీ పనులను త్వరలో పూర్తిచేయనున్నట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతుగా కారు గుర్తుకు ఓటేసి భారీ మోజారిటీ ఇవాల్సిందిగా బోడుప్పల్ వక్ఫ్‌బోర్డు బాధితులను ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో జంట కార్పొరేషన్ల మేయర్లు బుచ్చిరెడ్డి, జక్క వెంకట్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్, స్థానిక కార్పొరేటర్లు పద్మారెడ్డి, చీరాల నర్సింహ, చందర్ గౌడ్, బొమ్మక్ సుగుణ బాలయ్య, సుమన్ నాయక్, కో ఆప్షన్ సభ్యులు దత్తాత్రేయ శాస్త్రి, పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నాయకులు కొత్త రవిగౌడ్, బందారం నగేశ్, ఉప్పరి విజయ్, కీర్తన్ రెడ్డి, అలీం, మోతె రాజు, శ్రీనివాస్ గుప్త కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### 88 నామినేషన్లు వెనక్కి..: జాక్ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి

బోడుప్పల్ వక్ఫ్‌బోర్డు సమస్యపై ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, మంత్రి మల్లారెడ్డి, అధికారులు సానుకూలంగా స్పందించడం సంతోషకరమని, బోడుప్పల్ వక్ఫ్‌బోర్డు బాధితులు నేడు దీపావళి రోజని బోడుప్పల్ వక్ఫ్‌బోర్డు జేఏసీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, కో కన్వీనర్ కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఏడువేల కుటుంబాల బాధితులతో మంగళవారం సమావేశం ఏర్పాటుచేసి బోడుప్పల్ వక్ఫ బోర్డు బాధితులు వేసిన 88 నామినేషన్లను ఏకగ్రీవ తీర్మానం చేసి వెనక్కి తీసుకుంటామని జేఏసీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం అనుకూలంగా ఉందంటూనే సమస్యను నాన్చివేసే ధోరణి పురనావృత్తమైతే రానున్న ఎన్నికల్లో మళ్లీ ఉద్యమిస్తామని జాక్ ప్రతినిధులు స్పష్టం చేశారు.

# గ్రేటర్‌లో.. సగం యువతరం

## హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఓటర్లలో సగం యువతరమే..

- 1.08 కోట్ల ఓటర్లలో 18-39 మధ్య వయస్కులు 49.39 శాతం మంది
- అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 51 శాతం మంది
- మేడ్చల్‌లో 48.92 శాతం కాగా... హైదరాబాద్‌లో 40.26 శాతం
- మూడు జిల్లాల పరిధిలో 48.46 శాతం మంది మహిళా ఓటర్లు



సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/సిటీబ్యూరో, నవంబరు 13(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగర ఓటర్లలో సగం మంది యువతరం.. ప్రజాస్వామ్యానికి ఇదో పెద్ద ఉపశమనం. తెలంగాణకు గుండెకాయ లాంటి హైదరాబాద్ మహా నగర ఓటరు జాబితాలో యంగ్ తరంగ్ ఉరకలెత్తడం శుభ పరిణామం. తాజా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి విడుదలైన ఓటరు తుది జాబితాలో సగం మంది 18-39 మధ్య వయసున్న ఓటర్లు సగం మంది ఉండటం విశేషం. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల ఓటరు జాబితాను పరిశీలిస్తే ఈ ఆసక్తికర అంశం వెల్లడవుతుంది. అదే విధంగా మహిళా ఓటర్లు కూడా సగానికి దరిదాపుల్లో ఉండటం మరో విశేషం. ఇంకోవైపు 80 ఏండ్లు పైబడిన ఓటర్ల శాతం మూడు జిల్లాల్లో కలిపి కేవలం 1.44 శాతం మాత్రమే.

### తొలిసారి ఓటు వేస్తున్న వారి సంఖ్య 2.10 శాతం

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ, పరిశీలన పూర్తయింది. ఇదే క్రమంలో కీలకమైన తుది ఓటరు జాబితాపైనా పూర్తి స్పష్టత వచ్చింది. అధికార యంత్రాంగం వయసుల వారీగా ఓటర్లను కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో మూడు జిల్లాల పరిధిలోని మొత్తం ఓటర్లలో తొలిసారిగా ఓటు వేస్తున్న వారి సంఖ్య 2.10 శాతంగా ఉంది. 18-39 మధ్య వయసు ఉన్న ఓటర్ల శాతం 49.39 శాతం ఉండగా... ఇందులో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలో యువ ఓటర్ల భాగస్వామ్యం ఏకంగా 51.22 శాతంగా ఉంది. రెండో స్థానంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో యువ ఓటర్లు 48.92 శాతంగా ఉంది. హైదరాబాద్ జిల్లాలో మాత్రం వీరి శాతం 40.26 శాతంగా నమోదైంది. దీంతో ఈ నెల 30వ తేదీన జరగనున్న పోలింగులో అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చడంలో యువ ఓటర్లే కీలకం కానున్నారనేది సుస్పష్టం.

### హైదరాబాద్‌లో మహిళలే అధికం...

మహిళా ఓటర్ల పరంగా చూస్తే మూడు జిల్లాల పరిధిలోని మొత్తం ఓటర్లలో దాదాపు సగం మంది వరకు మహిళా ఓటర్లు ఉండటం విశేషం. సుమారు 1.08 కోట్ల ఓటర్లలో మహిళలు 52,72,559 మంది ఉన్నారు. అంటే మొత్తంలో వీరి శాతం 48.46 శాతం. కాగా, జిల్లాల వారీగా చూస్తే.. మిగిలిన రెండు జిల్లాలతో పోలిస్తే హైదరాబాద్ జిల్లాలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ వీరి శాతం 48.79 శాతం. రంగారెడ్డి పరిధిలో మహిళా ఓటర్లు 48.25 శాతం ఉండగా, మేడ్చల్-మల్కాజిగిరి పరిధిలో మహిళా ఓటర్లు 48.20 శాతం ఉన్నారు.

## జిల్లాల వారీగా వయసుల వారీగా ఓటర్లు ఇలా...

### హైదరాబాద్ జిల్లా

| వయస్సు | ఓటర్లు |
|---|---|
| 18-19 | 77522 |
| 20-29 | 724364 |
| 30-39 | 1387744 |
| 40-49 | 1024964 |
| 50-59 | 655805 |
| 60-69 | 386759 |
| 70-79 | 199657 |
| 80 సం.పైబడి | 80037 |
| | 4536852 |

- 18-39 మధ్య వయసు వారి శాతం 40.26 శాతం
- మహిళా ఓటర్లు – 22,13,902 – 48.79 శాతం

### మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

| వయస్సు | ఓటర్లు |
|---|---|
| 18-19 | 59213 |
| 20-29 | 485176 |
| 30-39 | 834999 |
| 40-49 | 665971 |
| 50-59 | 401004 |
| 60-69 | 227894 |
| 70-79 | 111819 |
| 80 సం.పైబడి | 33216 |
| | 2819292 |

- 18-39 మధ్య వయసువారి శాతం 48.92 శాతం
- మహిళా ఓటర్లు – 13,59,057 – 48.20 శాతం

### రంగారెడ్డి జిల్లా

| వయస్సు | ఓటర్లు |
|---|---|
| 18-19 | 92540 |
| 20-29 | 637940 |
| 30-39 | 1073733 |
| 40-49 | 777548 |
| 50-59 | 477325 |
| 60-69 | 281235 |
| 70-79 | 138324 |
| 80 సం.పైబడి | 43775 |
| | 3522420 |

- 18-39 మధ్య వయసువారి శాతం 51.22 శాతం
- మహిళా ఓటర్లు – 16,99,600 – 48.25 శాతం

**మూడు జిల్లాల పరిధిలోని మొత్తం ఓటర్లు – 1,08,78,564**

**మహిళా ఓటర్లు – 52,72,559 – 48.46 శాతం**

18-19 వయసు (కొత్త ఓటర్లు ) ఓటర్లు – 2,29,275 – 2.10 శాతం

18-39 మధ్య వయసున్న ఓటర్లు – 49.39 శాతం

80 పైబడిన వయసున్న ఓటర్లు – 1,57,-28 – 1.44 శాతం

## ఖానాపురంలో అగ్నిప్రమాదం.. బుగ్గిపాలైన టెంట్‌హౌస్



మణికొండ, నవంబర్ 13: నార్సింగి పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఓ టెంట్ హౌస్ పూర్తిగా కాలిపోయింది. మరో ఇల్లు పాక్షికంగా కాలిపోయింది. స్థానికులు, నార్సింగి పోలీసుల కథనం ప్రకారం.. ఖానాపూర్ గ్రామంలోని ఓ రేకుల షెడ్డులో గత కొన్నాళ్లుగా బాలాజీ టెంట్ హౌస్‌ను నిర్వహిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా నిర్వాహకులు పూజలు ముగించుకుని టెంట్‌హౌస్ మూసి వెళ్లిపోయారు. రాత్రి పదిగంటల సమయంలో ఒక్కసారిగా భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై నీళ్లు చల్లేప్రయత్నం చేశారు. ప్రయోజనం లేకపోవడంతో అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చారు. అప్పటికే పక్కనే ఉన్న ఓ మూడంతస్తుల భవనం పాక్షికంగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో టెంట్ హౌస్‌లోని రూ.50 లక్షల విలువజేసే సామగ్రి పూర్తిగా కాలిపోయింది. అప్రమత్తమైన ఫైర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని దాదాపు గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తాసుకొచ్చారు. టెంట్‌హౌస్ యజమాని కుమ్మరి శేఖర్ ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. పక్కనే ఉన్న ఇంటి యజమాని సైతం తన ఇల్లు కూడా పాక్షికంగా కాలిపోయిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న నార్సింగి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దీపావళి పటాకులు వచ్చిపడ్డాయా.? లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కాల్చారా.. ప్రమాదవశాత్తు ఈ ప్రమాదం జరిగిందా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.